క్లుప్తంగా

ప్రోత్సహించేందుకే పదోన్నతులు



నవీపేట: విధి నిర్వహణలో అంకితభావాన్ని ప్రోత్సహించేందుకు పదోన్నతులు రెట్టింపు ఉత్సాహాన్ని అందిస్తాయని సీఐ రాజారెడ్డి పేర్కొన్నారు. సీఐగా పదోన్నతి పొందిన ఎస్సై రాజారెడ్డిని జనవికాస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం శాలువా, మెమోంటోలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పదోన్నతులు ఆశించకుండా అంకితభావాన్ని అలవర్చుకుంటే సమాజంలో పేరు ప్రతిష్టలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో జనవికాస్ సేవా సంస్థ జిల్లా అధ్యక్షులు తెడ్డు పోశెట్టి, మాజీ ఎంపీపీ సూరిబాబు, నాయకులు రాంరెడ్డి, గంగాధర్, దేవరాజ్, రామకృష్ణ, నరేష్ పాల్గొన్నారు.

రుణమాఫీ ఏకకాలంలో చేయాలి



ఆర్మూర్: ఖరీఫ్ సీజన్‌లో రైతులందరికి లక్ష రుణమాఫీని ఏకకాలంలో చేయాలని ఏఐకేఎస్ రాష్ట్ర కార్యదర్శి బి.దేవరాం అన్నారు. ఆర్మూర్ పట్టణంలో ఆదివారం అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు నూతన రుణాలు అందించాలని, అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు ఉచితంగా ఇవ్వాలన్నారు. ఇటీవలే కురిసిన అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు రూ. 10వేలు ఇస్తామన్నా మాట నీళ్ల మూటయిందని ఎద్దేవా చేశారు. వాణిజ్య పంటకు రూ.లక్ష, ఇతర పంటలకు రూ.50వేలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ప్రతి పంటకు బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యవర్గం ఇచ్చిన పిలుపులో భాగంగా ఈనెల 22న జిల్లాలో, అన్ని మండలాల్లో జేడీఏ కార్యాలయం ఎదుట ఆందోళన చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, గుమ్ముల గంగాధర్, పుట్టి నాగన్న, మల్లన్న పాల్గొన్నారు.

మురికి కాలువ నిర్మించాలి



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని ఏడవ వార్డులో మురికి కాలువలు నిర్మించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. స్థానిక కౌన్సిలర్ సంవత్సరం క్రితం డ్రైనేజీ నిర్మిస్తానని చెప్పి ఇప్పటి వరకు నిర్మించకపోవడంతో స్థానికుడు అయిన ఖాందేశ్ ప్రశాంత్ మురికి కాలువలో దిగి నిరసన వ్యక్తం చేశారు. మురికి కాలువ నిర్మించి ఇబ్బందులు తొలగించాలని ఈ సందర్భంగా స్థానికులు డిమాండ్ చేశారు.

ప్రజాసంఘాల నేతలపై అక్రమ కేసులు ఎత్తేయాలి

మోర్తాడ్: ప్రజల సమస్యలపై, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ప్రజా సంఘాల నాయకులపై రాజద్రోహం కేసులను నమోదు చేసి వేధించడం సరికాదని అఖిల భారతీయ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ అన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్‌పైన కేసు ఎత్తివేసినట్లుగానే ఇతర ప్రజా సంఘాల నాయకులపై కేసులను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం భాస్కర్ మోర్తాడ్‌లో మాట్లాడారు. రాజద్రోహం కేసులను నమోదు చేసి ఉద్యమాలను అణచివేయాలని చూడటం అవివేకం అన్నారు.

కేజీబీవీలో అటెండర్ కావాలి

రుద్రూర్: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న అటెండర్ పోస్టు భర్తీకి ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి శాంతకుమారి తెలిపారు. అనుభవం ఉన్నవారు ఈనెల 19 నుంచి 21లోగా కేజీబీవీలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

పాఠశాల యాజమాన్యమే బాధ్యత వహించాలి

బాల్కొండ: మండల కేంద్రంలోని పూలే బీసీ బాలికల పాఠశాల భవనంపై నుంచి విద్యార్థి బ్లెస్సీ దూకి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటనకు పాఠశాల యాజమాన్యమే బాధ్యత వహించాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ద్యాగ శేఖర్ ఆదివారం డిమాండ్ చేశారు. విద్యార్థుల పట్ల పాఠశాలలో ఉపాధ్యాయులు తీవ్ర వేధింపులకు పాల్పడు తున్నారని ఆరోపించారు. పలుమార్లు ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. అనేక మంది విద్యార్థులు టీసీ తీసుకుని వెళ్లారన్నారు. వేధిస్తున్న ఉపాధ్యాయులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

- 5వ డివిజన్‌కు రూ.4.80 కోట్ల నిధులు
- సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, బ్రిడ్జి, ఇతర అభివృద్ధి పనులు
- మరో రూ.50 లక్షలతో సెంట్రల్ లైటింగ్

మోపాల్(నిజామాబాద్‌రూరల్) : నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని కార్పొరేషన్‌లో విలీనమైన బోర్గాం(పి) 5వ డివిజన్ అభివృద్ధికి శరవేగంగా అడుగులు పడుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ విజ్ఞప్తి మేరకు డివిజన్‌కు రూ.4.80కోట్ల ప్రత్యేక ఫండ్‌ను మంత్రి కేటీఆర్ మంజూరుచేశారు. ఈ నిధులతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, బీటీ రోడ్లు, బ్రిడ్జి, ఇతర అభివృద్ధి పనులకు కేటాయించారు. ఇప్పటికే పనులు శరవేగంగా సాగుతున్నాయి. మరో రూ.50లక్షలతో సెంట్రల్ లైటింగ్‌కు నుడా నుంచి కేటాయించారు.

నగరశివారులోని బోర్గాం(పి) గ్రామం నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమైంది. ఆ సమయంలో జరిగిన ఎన్నికల్లో కార్పొరేటర్‌గా బీజేపీ అభ్యర్థి సందగిరి సౌజన్య రాజశేఖర్‌రెడ్డి విజయం సాధించారు. పంచాయతీగా ఉన్న సమయంలోనే బోర్గాం(పి) అన్ని రంగాల్లో అభివృద్ధి చెందింది. గ్రామం నూతన కాలనీలతో చాలా వేగంగా విస్తరించింది. వ్యాపార సముదాయాలు, వెంచర్లు, ఇండ్ల నిర్మాణంలో ముందంజలో ఉండేది. ఈ డివిజన్ ద్వారా మున్సిపాలిటీకి ఏడాదికి పన్నుల రూపంలో రూ.3 కోట్ల వరకు ఆదాయం సమకూరుతోంది. కాగా నగరీకరణలో భాగంగా ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు మంత్రి కేటీఆర్ నిధులు విడుదల చేసినందుకు డివిజన్‌వాసులు వారిరువురికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.



శ్రీనివాస్‌రెడ్డి కాలనీలో వేసిన సీసీ రోడ్డు

కొనసాగుతున్న అభివృద్ధి పనులు..

డివిజన్ అభివృద్ధికి రూ. 4.80 కోట్లు విడుదల కాగా, ఆ నిధులతో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, బీటీ రోడ్లు, బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారు. కాలనీల్లోని ప్రజల విజ్ఞప్తి మేరకు స్పెషల్ ఫండ్ ద్వారా ఎమ్మెల్యే బాజిరెడ్డి నిధులు మంజూరు చేయించారు. అదేవిధంగా 400 మీటర్ల సెంట్రల్ లైటింగ్ కోసం నుడా నుంచి మరో రూ.50లక్షలు విడుదల చేశారు. స్థానిక నాయకుల విజ్ఞప్తి మేరకు బోర్గాం(పి) చౌరస్తా నుంచి మోటాటిరెడ్డి కళ్యాణమండపం వరకు రోడ్డు వెడల్పు, ఇతర అభివృద్ధి పనులకు మరో రూ.4.50 కోట్లు మంజూరు కానున్నాయని బీఆర్ఎస్ నాయకులు పేర్కొంటున్నారు. వీలైనంత త్వరలోనే డివిజన్ రూపురేఖలు మారిపోనున్నాయి.

సంతోషంగా ఉంది



కార్పొరేషన్ పరిధిలోని 5వ డివిజన్ అభివృద్ధికి రూ.4.80 కోట్లు విడుదల చేసి, అభివృద్ధి పనులు చేపడుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కమ్యూనిటీహాళ్లతో పాటు రోడ్లు, డ్రెయినేజీ పనులకు నిధులు కేటాయించారు. కాలనీల్లోనూ రోడ్లు వేస్తుండటంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తంచేశారు. 5వ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు.

–గంగాదాస్, 5వ డివిజన్

సాగు, తాగు నీటి రంగాల్లో మనమే టాప్

- రాముడిని అడ్డం పెట్టుకొని బీజేపీ రాజకీయాలు చేస్తోంది
- మంచి నీళ్ల పండగ కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్



మాట్లాడుతున్న ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

ఇందల్వాయి: సీఎం కేసీఆర్ కృషితో తాగు, సాగు నీటి రంగాల్లో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉందని ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఇందల్వాయి మండల కేంద్రంలోని మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మంచి నీళ్ల పండగ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో వేసవిలో తీవ్రమైన తాగు, సాగు నీటి కొరత ఉండేదని మహిళలు బిందెలు పట్టుకొని బావులు, మోటార్ల దగ్గర పడిగాపులు కాసేవారని, తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నాక కేసీఆర్ మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాలతో సమస్యలను అధిగమించామని అన్నారు. నియోజకవర్గంలో మిషన్ భగీరథ పథకం ద్వారా 612.97 కోట్లతో 282 జనావాసాలకు 682 కి.మీల పైపు లైన్లు, 179 నూతన ట్యాంకులు నిర్మించి 63,432 నల్లాలు బిగించి ఇంటింటికి నీటి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రూ.వేల కోట్లతో సంక్షేమ పథకాలు అందిస్తుంటే వాటిని చూసి మతి తప్పిన బీజేపీ నాయకులు ఏమీ తోచక రాముడి పేరు మీద మత రాజకీయాలు చేస్తున్నారని బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి కార్యకర్తలు ప్రజలకు వివరించాలని అన్నారు. మిషన్ భగీరథ డీఈ ధర్మేందర్, ఈఈ రాకేష్, డీపీవో జయసుధ, డీసీఎంఎస్ చైర్మన్ సంబారి మోహన్, తహసీల్దార్ రోజా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దాసు, ఎంపీపీలు రమేష్ నాయక్, సారికరెడ్డి, సుమలత, జెడ్పీటీసీలు మాన్‌సింగ్, దాసరి ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు

సిరికొండ: కుర్దుల్‌పేట్‌లో హనుమాన్ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ నిధులు మంజూరు చేశారని సర్పంచ్ గంగాధర్, బీఆర్ఎస్ నాయకులు ఆదిత్య తెలిపారు. రూ.40 లక్షల నిధులు మంజూరు పత్రాన్ని ఆర్టీసీ చైర్మన్, సర్పంచ్ గంగాధర్‌కు ఆదివారం అందజేశారు. జెడ్పీటీసీ మాన్‌సింగ్, ఉపసర్పంచ్ భూమయ్య, ఆలయ కమిటీ చైర్మన్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ క్రీడాకారుడికి సన్మానం



వినయ్‌ని సన్మానిస్తున్న బాజిరెడ్డి

ఇందల్వాయి: ఈ నెల 23, 24వ తేదీలలో జపాన్ దేశంలో జరిగే అండర్-19 ఏసియన్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైన డిచ్‌పల్లి మండలం మిట్టాపల్లి గ్రామానికి చెందిన గుండ వినయ్ అనే క్రీడాకారుడిని బాజిరెడ్డి గోవర్ధన్ ఆదివారం సన్మానించారు. వినయ్‌కి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగా మోహన్, జిల్లా వ్యాయమ ఉపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శి బొజ్జ మల్లేష్ తదితరులున్నారు.

ఇంటింటికి తాగునీరు ఘనత మాదే

- మాటల్లో కాదు.. చేతల్లో అభివృద్ధి చూపిస్తున్నాం
- అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా

నిజామాబాద్‌నాగారం: మిషన్ భగీరథ పథకంతో ఇంటింటికి తాగునీరు అందిస్తున్నామని.. మాటల్లో కాకుండా చేతల్లో అభివృద్ధి చేసి చూపిస్తున్నామని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని న్యూ అంబేడ్కర్ భవన్లో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ మంచినీటి పండగ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. నాయకుడంటే ఎలక్షన్ల కోసం కాదని, భావితరాల కోసం పనిచేసే వారన్నారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొని యుద్ధ ప్రాతికన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాన్ని, అధునాతన టెక్నాలజీతో పూర్తి చేసినట్లు తెలిపారు. నగర ప్రజలకు 24 గంటలు మంచి నీరు అందివ్వడమే నా ముందున్న కర్తవ్యమన్నారు. వేసవిలో నీటి సమస్య రాకుండా ఉండేందుకు డివిజన్‌కు రూ.5 లక్షలు ఖర్చు చేసి బోర్లు వేయించామన్నారు. కొన్ని ప్రాంతాలకు ట్యాంకర్లతో ప్రజలకు నీటిని అందించామన్నారు. మేయర్ దండు నీతు కిరణ్, నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యాదవులకు అండగా ఉంటా

నిజామాబాద్‌నాగారం: నగరంలో ఉన్న యాదవులకు అండగా ఉండి అభివృద్ధికి పాటుపడుతానని ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా తెలిపారు. ఆదివారం నగరంలోని ఇంద్రపూర్ కాలనీలో యాదవ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే మాట్లాడారు. తెలంగాణలో అందరి చూపు నిజామాబాద్ అభివృద్ధిపై ఉందన్నారు. కుల వృత్తులను కాపాడుతున్న మహోన్నత వ్యక్తి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. గొల్ల కురుమ కులస్తులకు సబ్సిడీ కింద గొర్రెల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. యాదవ సంఘం అభివృద్ధికి రూ.25 లక్షల సీడీపీ నిధులు మంజూరు చేశారు. ఆత్మీయ సమ్మేళనాల్లో ఆత్మీయ పలకరింపులు, మానవ సంబంధాలకు వేదికగా మారుతున్నాయన్నారు. యాదవ సోదరులను కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. పట్టణ యాదవ సంఘానికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రూ.25 లక్షలు మంజూరు చేయడం సంతోషకరమైన విషయమన్నారు. అనంతరం పట్టణ యాదవ సంఘం అధ్యక్షుడు గుర్రం మల్లేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి యాదగిరి యాదవ్, తదితరులతో ప్రమాణ స్వీకారం చేయించారు.



జాతీయ గీతం ఆలపిస్తున్న ఎమ్మెల్యే తదితరులు



యాదవులతో ప్రమాణ స్వీకారం చేయిస్తూ..

ఎమ్మెల్యే బిగాలకు పుస్తకాలు, పెన్నులు

నిజామాబాద్‌నాగారం: హరితహారం నిర్వహణలో నిజామాబాద్ నగరం మొదటి స్థానం సాధించి మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న సందర్భంగా ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తాకు నగర సీఐలు వెంకట నారాయణ, విజయ్ బాబు, ఎస్సై పూర్ణేశ్వర్‌లు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఆదివారం నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పుస్తకాలు, పెన్నులు అందించారు.

టీవీ టెక్నీషియన్ భవనం ప్రారంభం

నిజామాబాద్‌నాగారం: నగరంలోని గాయత్రినగర్‌లో సీడీపీ నిధులతో నిర్మించిన ఇందూరు టీవీ టెక్నీషియన్ యూనియన్ నూతన భవనాన్ని ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..నూతన భవనం నిర్మించుకోవడం అభినందనీయమని అన్నారు. 2018లో మీ సమావేశానికి వచ్చినపుడు స్థల సేకరణ చేస్తే నిధులు ఇస్తానని మాటిచ్చానని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారమే నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో అధికారం కాంగ్రెస్‌దే

ఇందల్వాయి: రానున్న ఎన్నికల్లో తెలంగాణాలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని పార్టీ నిజామాబాద్ రూరల్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ భూపతి రెడ్డి జోస్యం చెప్పారు. నల్లవెల్లిలో మండల స్థాయి కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో భూపతి రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వచ్చేలా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని, బీఆర్ఎస్ పార్టీ తొమ్మిదేళ్ల పాలనలో తెలంగాణ మొత్తం అవినీతిలో కూరుకుపోయిందని విమర్శించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చని బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులకు ఓట్లు అడిగే హక్కు లేదని విమర్శించారు. నల్లవెల్లి, స్టేషన్‌తండా, కేకే తండా, మేఘ్యానాయక్ తండాలకు చెందిన పలువురు భూపతి రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగేష్ రెడ్డి, ఉపాధ్యక్షులు తాహెర్ బిన్ హుందాన్ ,పీసీసీ ప్రతినిధి శేఖర్ గౌడ్, కిసాన్ ఖేత్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, మండల అధ్యక్షుడు నవీన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ భూపతి రెడ్డి

అక్రమాలపై విచారణ జరిపించాలి

ఆర్మూర్‌టౌన్: తెలంగాణ యూనివర్సిటీలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ ఆర్మూర్ ఏరియా అధ్యక్షుడు అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. అనిల్ మాట్లాడుతూ.. యూనివర్సిటీలో విజిలెన్స్, ఏసీబీ దాడులు చేసినా ఎలాంటి చర్యలు లేకుండా నామమాత్రంగానే ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే సీఎం కేసీఆర్ యూనివర్సిటీ అభివృద్ధి కోసం రూ.500 కోట్లు మంజూరు చేయాలని లేని పక్షంలో జిల్లాకు వస్తే అడ్డుకుంటామన్నారు. నవీన్, ఆకాష్, రాము పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	61,050	వెండి (కిలో)	75,700
22 క్యారెట్స్	56,286		– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	35	60	క్యాప్సికం	60	80
బెండకాయ	30	50	గాజరుగడ్డ	30	50
బీరకాయ	40	60	పచ్చిమిర్చి	70	100
దొండకాయ	25	50	దోసకాయ	10	20
బీర్నీసుకాయ	150	200	ఆలుగడ్డ	20	40
కాకరకాయ	35	50	గోబిగడ్డ	15	30
వంకాయ	20	40	గోబిపువ్వు	30	50
పాలకూర	40	60	బీట్‌రూట్	30	50
మెంతికూర	70	90	గోరు చిక్కుడు	40	60
కొత్తిమీర	80	100	చిక్కుడుకాయ	50	70
పుదీనా	50	70			– ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	240
		లైవ్	180
స్కిన్‌లెస్	280	మటన్	800

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ఆది పురుష్(తెలుగు) -9.00,12.30 4.00,7.30,10.55
స్క్రీన్-2	ఆది పురుష్(తెలుగు) -8.30,12.00 3.30,7.30,10.30
స్క్రీన్-3	ది ఫ్లాష్-(ఇంగ్లీష్) - 8.30,12.00, 3.30,7.00,10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఆది పురుష్(తెలుగు)- 3డీ -8.00, 11.45,3.30,7.15,11.00
స్క్రీన్-2	ఆది పురుష్(తెలుగు) -3డీ-11.00, 2.45,6.30,10.15
స్క్రీన్-3	ఆది పురుష్(తెలుగు)- 2డీ -10.30 2.15,6.00,9.45
స్క్రీన్-4	ది ఫ్లాష్(తెలుగు) -12.45 ట్రాన్స్‌ఫార్మర్స్(ఇంగ్లీష్)2డీ -3.55 ది ఫ్లాష్(ఇంగ్లీష్) -6.50,10.00
దేవి	విమానం
నటరాజ్	ఆది పురుష్(హిందీ)
లలితామహల్	ఆది పురుష్(తెలుగు)
విజయ్	ఆది పురుష్(తెలుగు)

ఇందూరులో అన్నమయ్య మళ్లీ పుట్టాడు

- ప్రముఖ విశ్లేషకులు పమిడికాల్వ మధుసూదన్
- ఇందూరు అన్నమయ్య మన జిల్లాకు ఆధ్యాత్మిక సంపద: బాజిరెడ్డి జగన్

మోపాల్(నిజామాబాద్‌రూరల్): ఇందూరులో అన్నమయ్య మళ్లీ పుట్టాడని, ఆనాడు ఆ అన్నమయ్య ఏడుకొండల వాడిపై ఏ ఆర్తితో కీర్తనలు రాసాడో ఆ ఆర్తి నర్సింహారెడ్డి కీర్తనలో కనపడుతోందని సీనియర్ జర్నలిస్టు, ప్రముఖ విశ్లేషకులు పమిడికాల్వ మధుసూదన్ పేర్కొన్నారు. ఆదివారం నర్సింగ్‌పల్లి ఇందూరు తిరుమల ఆలయంలో హరినామ చింతనలో భాగంగా ఇందూరు అన్నమయ్య నర్సింహారెడ్డికి అభినందన సభ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మధుసూదన్ మాట్లాడుతూ.. నర్సింహారెడ్డి ప్రతి కీర్తనలో ఆధ్యాత్మికతతోపాటు సమాజహితం కూడా ఉందని తెలిపారు. భయం లేని భక్తికి విలువ ఉండదన్నారు. నర్సింహారెడ్డి ఇందూరుకు దొరికిన గొప్ప వరం అని, భవిష్యత్‌లో ఆయన మన జిల్లాకు గొప్ప ఆధ్యాత్మిక సంపదగా మారుతారని ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ పేర్కొన్నారు. ఆలయ ఆస్థాన గాయకులు నర్సింహారెడ్డి రచించిన కీర్తనలు పాడగా, ప్రముఖ సాహితీవేత్తలు కాసర్ల నరేష్, చందన్‌రావు, ఆరుట్ల శ్రీదేవి, సినీ నటులు రవి, పంచరెడ్డి లక్ష్మణ్ ఆ కీర్తనలపై విశ్లేషణ చేశారు. ప్రముఖ వేణు గాన విద్వాంసులు పాడుతా తీయగ ఫేం యుగంధర్ తన మురళితో ఇందూరు అన్నమయ కీర్తనలను వాయించి ఆహుతులను వినోదపరిచారు. హరిదా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కాసర్ల నరేష్ రావు సభాధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఎంపీటీసీ రాములు, ఇన్‌ఛార్జి సర్పంచి రాజేశ్వర్, తదితరులున్నారు.



నర్సింహారెడ్డి దంపతులను సన్మానిస్తున్న అతిథులు

అంతర్జాతీయ యోగా దినోత్సవం కరపత్రాల ఆవిష్కరణ



నిజామాబాద్ సిటీ: ఈ నెల 21న తొమ్మిదవ అంతర్జాతీయ యోగ దినోత్సవం–2023 సందర్భంగా ఆదివారం సన్నాహక సమావేశాన్ని ఇందూరు జిల్లా కేంద్రంలోని భారత స్వాభిమాన్ ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించారు. సంబంధిత కరపత్రాలను కార్యవర్గ సభ్యులు ఆవిష్కరించారు. అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసినట్లు సభ్యులు తెలిపారు. ఈ సంవత్సరం అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని నగరంలోని శివాజీ నగర్ మున్నూర్‌కాపు కల్యాణ మండపంలో(న్యాల్ కల్‌రోడ్డు చౌరస్తా) ఉదయం 6 గంటల నుంచి 8 వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇంజనీర్ గంగాధర్, గంజి సాయన్న, తోర్తిబుచ్చన్న, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మంచినీళ్ల పండుగ వేడుకలు



తూంపల్లిలో పాల్గొన్న సర్పంచ్ బాలమణి

సిరికొండ: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంచి నీళ్ల పండుగ వేడుకలను పలు గ్రామాల్లో ఆదివారం నిర్వహించారు. మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులను కొబ్బరి ఆకులు, మామిడి ఆకుల తోరణాలతో అందంగా అలంకరించారు. కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేశారు. తెలంగాణ రాక ముందు వేసవిలో త్రాగు నీరు ఇబ్బందులుండేవని, సీఎం కేసీఆర్ తెచ్చిన మిషన్ భగీరథ పథకంతో గ్రామాల్లో నీటి కష్టాలు దూరమయ్యాయని కొనియాడారు.

కొనసాగుతున్న 'విద్యుత్' మరమ్మతులు

సిరికొండ: మండలంలోని తాటిపల్లితో పాటు వివిధ గ్రామాల్లో పొలాల్లో వంగిపోయిన విద్యుత్ స్తంభాలను సరిచేస్తున్నారు. విద్యుత్ సమస్యలపై ఈ నెల 16న సాక్షిలో 'గాల్లో రైతుల ప్రాణాలు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన సిరికొండ ట్రాన్స్‌కో ఏఈ చంద్రశేఖర్ తన సెక్షన్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తున్నారు. వేలాడుతున్న తీగల వద్ద కొత్తగా స్తంభాలను కూడా వేయిస్తున్నట్లు తెలిపారు.



వంగిన స్తంభాన్ని సరి చేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

చక్రం గుడిలో ఘనంగా ఆత్మీయ సమ్మేళనం



రమణాచార్యులను సన్మానిస్తున్న రామానుజ జీయర్ స్వామి

నిజామాబాద్ సిటీ: శ్రీ వైష్ణవ ఆగమ సేవాసమితి(నిజామాబాద్) ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరిగింది. స్థానిక బ్రహ్మపురి చక్రం గుడిలో జరిగిన ఈ కార్యక్రమానికి త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి ముఖ్య అతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో శ్రీ వైష్ణవ వర్గానికి చెందిన ప్రముఖులను ఘనంగా సన్మానించారు. ఆర్మూర్ పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు గోవర్ధనం రమణాచార్యులు, ప్రముఖ హైకోర్టు న్యాయవాది గోవర్ధనం వేణు ఆచార్య, ఆర్టీసీ రంగాల్లో సేవలందించిన సేనాపతి శ్రీనివాసచార్యులు, ఉపాధ్యాయ వృత్తిలో సేవలందించిన కలకుంట్ల నరసింహాచార్యులు, తదితరులను సన్మానించారు. అర్చకులు నాని స్వామి పంతులు, యాదగిరి ఆచార్య, కిషోర్, వర్ధరాజన్, నాగరాజు పాల్గొన్నారు.